క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు లక్ష మల్లెపూజ



కాకుమాను: స్థానిక శ్రీ పోలేరమ్మ తల్లికి మంగళవారం రాత్రి మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష మల్లెలతో పూజ నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మ వారికి మంగళ స్నానాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. రాత్రి దేవాలయ ప్రాంగణంలో లక్ష మల్లె పూజ అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షించారు.

తెలగాయపాలెం చెరువులో పూడికతీత పనుల ప్రారంభం

తెలగాయపాలెం(కాకుమాను): మండలంలోని తెలగాయపాలెం తాగునీటి చెరువులో బుధవారం పూడిక తీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాహేలమ్మ మాట్లాడుతూ చెరువులో జమ్ము, నాచు పేరుకుపోవడంతో తాగునీటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ సరిపడా తాగునీరు అందించాలనే లక్ష్యంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో పూడికతీత పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాల ప్రతిభావంతులకు ప్రోత్సాహం



కళాశాల యాజమాన్యానికి చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ రంగారావు, శేషారత్నం

గుంటూరు రూరల్: చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయాలని కోరుతూ బుధవారం వజ్జా భార్గవ నాగలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ వజ్జా రంగారావు యాజమాన్యానికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కుమార్తె పేరుతో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల్ని అందిస్తున్న రంగారావు సేవల్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ, అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీ.ఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీకేపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల తనిఖీ

బీకేపాలెం(కాకుమాను):మండలంలోని బీకే పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని ఆయన హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



గుంటూరు రూరల్: నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తదితరులు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారితో కొంతసేపు మాట్లాడారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తును పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

మానవాళికి ఆదర్శం రామాయణం

పాత గుంటూరు: రామాయణ మహాకావ్యం మనవాళి జీవితానికి ఆదర్శవంతమైనదని ప్రముఖ సాహితీవేత్త లంకా విజయసారథి తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. లంకా విజయసారథి మాట్లాడుతూ రామాయణం కేవలం పురాణ పరమే కాకుండా అనేక సామాజిక అంశాలతో కూడినదని వివరించారు.ఆలయ కమిటీ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్ కృషి

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అగ్రస్థానం కల్పిస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో బుధవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 1354 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.10,13,90,358ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో మూడు విడతల్లో ఇప్పటి వరకు 4,160 స్వయం సహాయ సంఘాలలోని 1,63,936 మంది అక్కాచెల్లెమ్మలకు రూ.102.54 కోట్లు అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఏదో విధంగా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. వివక్ష లేకుండా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల్ని పారదర్శకంగా అందిస్తున్నట్లు వివరించారు. ప్రజల్ని నిరంతరం మోసం చేస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. ఆయన పాలనలో ఇన్ని సంక్షేమ పథకాల్ని ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఒక్క అమరావతి అభివృద్ధి చెందటం కాదని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. ప్రజల్ని మభ్య పెట్టడం, మోసగించటం, దుష్ప్రచారం చేయటంతో టీడీపీ కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేస్తున్న నిజమైన ప్రజానాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రానున్న కాలంలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని ఆర్థిక నిపుణులు కితాబు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బి. అనూరాధ, ఎంపీపీ కె. సాహితి, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వైస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాసరావు, కుర్రా పాములు, బి. విజయలక్ష్మి, ఎంపీడీవో బాబూరావు, ఏపీఎం వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు. జగనన్న చేసిన బాసరా ... వైఎస్సార్ ఆసరా అంటూ డ్వాక్రా మహిళలు పాడిన పాట ఆకట్టుకుంది. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్ద మోసగాడు, దోపిడీదారుడు చంద్రబాబు

పొన్నూరు(చేబ్రోలు): ఆంధ్ర రాష్ట్రంలో పెద్ద మోసగాడు, నైపుణ్యతతో కూడిన దోపిడీదారుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని దోపిడీ చేసే నైపుణ్యం చంద్రబాబు నాయుడుకి ఒక్కరికే సొంతమని ఎద్దేవా చేశారు. సీమెన్స్ కంపెనీతో శిక్షణ పేరుట షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బాబు అండ్ కో తన బినామీల కోసం యువత బతుకుల్ని బుగ్గిపాలు చేశారని ధ్వజమెత్తారు. రాజధానిలో తాత్కాలిక నిర్మాణాల పేరుతో నిధులు నొక్కేసిన చంద్రబాబుకు రాబోయే 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. పిచ్చి రాతలు రాసే పచ్చ మీడియాకు, సైకో ఆర్థిక నేరగాళ్లకు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, షేక్ సైపుల్లా, పెరికల కృష్ణమోహన్, వంశీ రెడ్డి, వెంకటసుబ్బయ్య, షేక్ మాము, గూడవల్లి గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం



పెదకాకాని వై. జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

పెదకాకాని: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. యూత్‌లు, వివిధ కమిటీల ఆధ్వర్యంలో బజార్లలో పందిళ్లు వేసి, అందంగా అలంకరించారు. నవమి వేడుకలు జరుపుకునేందుకు యూత్‌లు, కమిటీల ఆధ్వర్యంలో బజార్లలో పందిళ్ళు వేసి అలంకరించారు. ఆయా గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి పండుగకు ముస్తాబు చేశారు. శ్రీరామనవమి వేడుకలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పానకం, వడపప్పు, పొంగలి నైవేద్యం, పులిహోర పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పెదకాకాని వై జంక్షన్‌లో గత మూడు రోజులుగా శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామివార్ల విగ్రహాలను భక్తులు కొనుగోలు చేస్తున్నారు. భద్రాచలం, ఒంటిమిట్ట రామాలయాల్లో జరుగు విధంగా గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో శాస్త్రోక్తముగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుక నిర్వహించనున్నట్లు అర్చకులు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య రాక

పెదకాకాని: శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పెదకాకాని మండలంలోని నంబూరు జయభారత్‌రెడ్డి నగర్‌లోని రామాలయానికి రానున్నారు. అనంతరం 12:30 గంటలకు నంబూరు దక్షిణ బజారులోని రామాలయంలో జరిగే శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు పెదకాకాని కరణంగారి బజారులో జరిగే శ్రీరామనవమి ఉత్సవంలో పాల్గొంటారని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు.

విజ్ఞాన్‌లో సందడిగా కైజెన్-2కే23



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అధ్యాపక బృందం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ 'కైజెన్-2కే23' వేడుకల్ని బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగగలిగితే పది మందికి ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొత్తగా, సృజనాత్మకంగా ప్రయత్నిస్తే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సొంతమవుతుందని తెలిపారు. కైజెన్-2కే23ను పురస్కరించుకుని పలు అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ పనుల కల్పన

డ్వామా పీడీ యుగంధర్



బహిరంగ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ

ప్రత్తిపాడు: అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిందేనని డ్వామా పీడీ యుగంధర్ తెలిపారు. ప్రత్తిపాడులో బుధవారం ఉపాధి హామీ బహిరంగ ప్రజావేదికను నిర్వహించారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు ప్రత్తిపాడు మండలంలో సుమారు నాలుగు కోట్ల రూపాయల పనులు జరిగాయి. వీటికి సంబంధించి గత వారం రోజులుగా బృందాలు మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాయి. ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ ప్రజావేదికలో డీఆర్పీలు పంచాయతీల వారీగా పనుల వివరాల్ని వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ యుగంధర్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా పనులు చేయించినట్లు చెప్పారు. సోషల్ ఆడిట్‌లో సైతం ఎలాంటి లోపాలు గుర్తించలేదని పీడీ వివరించారు. ఉపాధి హామీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ టి.వి. విజయలక్ష్మి, అంబుడ్స్‌మన్ బాబూరావు, ఎస్సార్పీ కనకారావు, ఎంపీడీవో శ్రీరమ్య, ఎంపీపీ దాసరి అన్నమ్మ, డీఆర్పీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మనోరంజని

పెదనందిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మనోరంజని తెలిపారు. పెదనందిపాడు బీసీ అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం మధ్యాహ్నం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనతను నివారించాలని, వారి ఇంటికి వెళ్లి సలహాలు, సూచనలతో పాటు పౌష్టికాహారం తీసుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో మిల్లెట్స్ స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

జిల్లా జైలుకు పంపు సెట్టు బహూకరణ



పంపు సెట్టును బహూకరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గుంటూరు లీగల్: జిల్లా జైలులో మెరుగైన నీటి సరఫరా అందించేందుకు సహృదయ ఫౌండేషన్, సుబంధ ఫౌండేషన్ (యూఎస్ఏ)లు సుమారు రూ.67 వేలు విలువగల రెండు హెచ్.పి. మోటార్ సబ్ మెర్సిబుల్ పంపు సెట్టును, ఇతర సామగ్రిని జిల్లా జైలుకు బుధవారం బహూకరించారు. జైళ్ల శాఖ గుంటూరు రేంజి డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ సమక్షంలో కారాగార ఆవరణలో జైలు పర్యవేక్షణాధికారికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు మాట్లాడుతూ కూరగాయల పెంపకం, పచ్చదనాన్ని పెంపొందించేందుకు, ఖైదీలకు నీటి సరఫరా చేసేందుకు ఈ పంపుసెట్టును వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, జిల్లా జైలు జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, ఏ.కళ్యాణ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి

పెదకాకాని: బాజీ బాబా దర్గా రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. దర్గాలో ఆయన బుధవారం వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ, సర్వే అధికారులతో సమావేశమయ్యారు. వచ్చే నెల 20, 21వ తేదీల్లో దర్గా ఉరుసు మహోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రహరి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. రత్నం, అసిస్టెంట్ సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ బోర్డు కె. రమణమూర్తి, వి. తోయజాక్షరావు, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ వక్ఫ్ బోర్డు వి. దుర్గారావు, ఎండీ. బేగ్, వక్ఫ్ బోర్డు సర్వేయర్ శివనాగేశ్వరరావు, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బేగ్, పెదకాకాని సర్వేయర్ నాగరాజు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రైతులతో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలతో పాటు భూమి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని నాబార్డ్ ఏజీఎం కె. కార్తిక్ తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం సందున్న కృషి విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌కు చెందిన నారమ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విలువ ఆధారిత వానపాముల తయారీ శిక్షణలో భాగంగా ఎస్సీ రైతులు పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో వానపాముల ఎరువుల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ రైతులంతా సేంద్రియ వ్యవసాయ వైపు దృష్టి సారించాలని తెలిపారు. ఎరువుల తయారీ కేంద్రాల్ని ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు బ్యాంకుల ద్వారా అందించే సేవల్ని వివరించారు. అనంతరం రైతులకు పుట్ట గొడుగుల పెంపకం, టెర్రస్ గార్డెనింగ్, మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్ వంటి అంశాలపై రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నారమ్ సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. బాలకృష్ణన్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైటింస్ట్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గంగాదేవి పాల్గొన్నారు.

ఫార్మసీలో పీజీ అభ్యసించేందుకు పుష్కల అవకాశాలు

ఐర్లాండ్ దేశ ఉన్నత విద్యాశాఖ సలహాదారుడు



డేవిడ్ ఫల్లోన్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం, శ్రీనివాసరాజు, రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీలో పీజీ అభ్యసించేందుకు ఐర్లాండ్‌లో పుష్కల అవకాశాలున్నాయని ఆ దేశపు ఉన్నత విద్యాశాఖ సలహాదారుడు డేవిడ్ ఫల్లోన్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఐర్లాండ్‌లో ఔషధ రంగంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డేవిడ్ ఫల్లోన్ మాట్లాడుతూ ఐర్లాండ్‌లో ఫార్మసీ ఉన్నత విద్యను నిర్వహిస్తున్న యూనివర్సిటీల వివరాలతో పాటు అందుబాటులో ఉన్న స్పెషలైజేషన్ కోర్సులు, పీజీ కోర్సుల్లో చేరేందుకు అర్హతలు, వీసా నిబంధనలు, ఫార్మా సంస్థల్లో ఉపాధి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐ-20 ఫీవర్ మేనేజర్ బి. శ్రీనివాసరాజు మాట్లాడుతూ పీజీ కోర్సులకు వివిధ యూనివర్సిటీల్లో అమల్లో ఉన్న ట్యూషన్ ఫీజుల వివరాల్ని తెలియజేశారు. అనంతరం అతిథుల్ని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బృందావన్ గార్డెన్స్ మూడో లైనులోని పూలషాపులో పూలు విక్రయిస్తున్న షేక్ బీబీ రహీమాను బుధవారం షంషీర్ బెదిరించి డబ్బులు తీసుకునేందుకు యత్నించాడు. రహీమా అడ్డుకుంది. షాపు యజమాని సోదరుడు అయిన తనను అడ్డుకుంటావా అంటూ షంషీర్ కత్తెరతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్ టాప్ చోరీ

ల్యాప్ టాప్ చోరీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన మనోజ్ గుంటూరులో సీఏ చదువుతూ బ్రాడీపేటలోని ఓ రూంలో ఉంటున్నాడు. మంగళవారం తలుపు వేసి నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి లోపలకు వచ్చి ల్యాప్ ట్యాప్ చోరీ చేశాడు.

రేపు కాకాని శివాలయంలో హుండీల లెక్కింపు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర ఆలయంలో ఈనెల 31న హుండీలను లెక్కించనున్నట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆ రోజు ఉదయం 8:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొ న్నారు. ఆలయ నిబంధనల ప్రకారం భక్తులు కూడా పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

గ్లోబల్ లీడర్స్‌గా నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ విద్యార్థులు



ప్రవీణ్‌ను సత్కరిస్తున్న శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య, ఆనంద్

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ స్థాయి ఆధునిక విద్యా బోధన, నాయకత్వ లక్షణాలను అలవర్చడం ద్వారా విద్యార్థుల్ని గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దుతున్నామని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె. శ్రీకాంత్ బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం లివ్ లైఫ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏడు అంశాలలో 'లీడర్ ఇన్ మీ' పేరుతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ భారతదేశ ప్రతినిధి, శిక్షకులు ప్రవీణ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో పదివేలకు పైగా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. నైతిక విలువలతో కూడిన జీవన శైలి నేర్పడం ద్వారా విద్యార్థులు తమ మాతృదేశాన్ని, సమాజాన్ని ప్రేమిస్తూనే ప్రపంచ నాయకులుగా ఎదిగేలా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాటుతూ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ లెర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీవిద్య, జనరల్ మేనేజర్ ఆనంద్, ప్రిన్సిపాల్ సుధీర్‌కృష్ణన్, అరవింద, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



చల్లావారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సాంబశివరావు, రవిశేఖర్, సుధీర్‌బాబు, వలంటీర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితాన్ని నాశనం చేస్తున్న మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు సూచించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు రూరల్ చల్లావారిపాలెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ సాంబశివరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలైన కొకైన్, గంజాయి వంటివి మనిషి విచక్షణను కోల్పోయేలా చేస్తాయని, తద్వారా ఎన్నో కష్టాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ప్రధానంగా యువత వీటికి ఎక్కువగా బానిసలుగా మారుతున్నారని, ఇటువంటి ప్రమాదకరమైన వ్యసనానికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధివీధికి తిరిగిన వలంటీర్లు మద్యం వద్దు – కుటుంబం ముద్దు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి – మానవత్వానికి దగ్గరగా చేరండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిశేఖర్ సందర్శించారు. ఆయన వెంట డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, గ్రామ సచివాలయ కార్యదర్శి కె.లక్ష్మి, వీఆర్వో లూర్దు రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.

భవనం పైనుంచి పడి యువకుడి దుర్మరణం

పీఎం పాలెం (విశాఖపట్టణం) : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు భవనం నాలుగో అంతస్తు నుంచి కింద పడడంతో దుర్మరణం చెందాడు. ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన రిచర్డ్స్ (29), అభిషేక్, మరో యువకుడు కలసి జీవీఎంసీ ఆరో వార్డు పరిధి కొమ్మాది సినిమా హాలు వెనక గల అపార్టుమెంటు నాలుగో అంతస్తులోని ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. రిచర్డ్స్ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. మంగళవారం రిచర్డ్స్‌తో పాటు అభిషేక్ మాత్రమే ఫ్లాట్‌లో ఉన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అపార్టుమెంటు పైనుంచి కిందకు పడటంతో తీవ్రంగా గాయపడిన రిచర్డ్స్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడిపోయి మరణించాడా.. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ? అని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కొరిటెపాడు: పెన్షన్ స్థిరీకరణ, కుటుంబ పెన్షన్ పెంపుదల, నూతన పెన్షన్ స్కీం రద్దు, అందరికీ పాత పెన్షన్ స్కీం అమలు వంటి తమ డిమాండ్లను వెంటనే ఆమోదించాలని కోరుతూ బుధవారం అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ఎస్.బంగారుబాబు అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన జాతీయ స్థాయి ధర్నాకు మద్దతుగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కె.ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి ఉద్యోగులకు జరిగే వేతన సవరణ మాదిరిగా పెన్షన్‌ను స్థిరీకరించాలని కోరారు. ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతం పెంచుతూ మేనేజ్‌మెంట్ పంపిన ఫైల్‌ను కేంద్ర ఆర్థిక శాఖ వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీని బలహీన పరిచే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మంచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ సంఘీభావం తెలిపారు.